భక్తిశ్రద్ధలతో మాసోత్సవం



భజనలో పాల్గొన్న భక్తులు, చిన్నారులు



నల్లకుంట: ప్రశాంత్‌నగర్‌లోని శ్రీకుసుమ హరనాథ ఆశ్రమంలో మాసోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం రాధా కృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10గంటలకు భక్తులతో 'జై హరనాథ.. జై కుసుమ కుమారికి జై' భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భజన, ప్రసాద వితరణతో మాసోత్సవం ముగిసింది. భక్తులకు తీర్థప్రసాద వితరణ కావించారు.

పరామర్శ



సందీప్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సందీప్ తండ్రి రవికుమార్(53) గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు సందీప్ నివాసానికి వెళ్లి రవికుమార్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. సందీప్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. రవికుమార్ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం దోమలగూడలోని శ్మశానవాటికలో జరిగాయి.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనే మహిళలకు లక్కీడ్రాను ఆదివారం ఉదయం రాంనగర్ మీ–సేవ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కీడ్రాలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారితో పాటు మరో 16మందికి బహుమతులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, నేత శ్రీనివాస్, కొండపల్లి మాధవ్, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, శ్యాంసుందర్, ఆకారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం

చిక్కడపల్లి: శ్రీకృష్ణ భాషా నిలయం 125 వార్షిక వేడుకలు ఇటీవల జరిగాయి. భాషా నిలయం సీనియర్ సభ్యుడిగా, ప్రముఖ అనువాదకుడు రచయిత అక్కిరాజు వెంకట జానార్ధనారావుకు భాషా నిలయం కార్యదర్శి టి.ఉదయవర్లు చిక్కడపల్లిలోని ఆయన నివాసానికి వచ్చి ఆయన చేసిన సేవలకు సత్కరించారు.

నర్తకి ప్రియదర్శినికి డాక్టరేట్

నల్లకుంట: అంబర్‌పేట పటేల్‌నగర్‌కు చెందిన భరతనాట్యం గురువు కూన ప్రియదర్శినికి అమెరికాకు చెందిన జార్జియా డిజిటల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్, ప్రభుత్వ రంగ సంస్థ నీతి అయోగ్ భరతనాట్యం విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు ఇటీవల ఆగ్రాలోని రాడిసన్ హోటల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖ సినీనటి, భరతనాట్య కళాకారిణి సుధాచంద్రన్ చేతుల మీదుగా కూన ప్రియదర్శిని గౌరవ డాక్టరేట్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు.



సుధాచంద్రన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న కూన ప్రియదర్శిని

'మెట్రో రైల్' ఓ రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్

- ప్రొఫెసర్ సి. రామచంద్రయ్య
- హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో సదస్సు



సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. రామచంద్రయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మెట్రో రైలు ప్రాజెక్టు ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు అని ప్రొ. సి.రామచంద్రయ్య విమర్శించారు. 'మెట్రో రైలు నష్టాలకు కారణం ఎవరూ.? భవిష్యత్ సవాళ్లు ఏమిటి.?' అనే అంశంపై ఆదివారం ఎస్వీ కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ప్రొ. సి.రామచంద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రయాణికుల ప్రయోజనాల కంటే రియల్ ఎస్టేట్ ప్రయోజనమే ప్రధానంగా కొనసాగిన మెట్రో రైలు ప్రాజెక్టు ఒప్పందం విఫలమైందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండగా మారుతుందని చెప్పారు.

వాగ్దానాలు నిలబెట్టుకోని ఎల్‌అండ్‌టీ..

అనేక వాగ్దానాలు చేసిన ఎల్‌అండ్‌టీ సంస్థ వాటిని నిలబెట్టుకోలేకపోయిందని అన్నారు. ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతుందని వేసిన అంచనా పూర్తిగా విఫలమయ్యిందని తెలిపాడు. కామన్ టిక్కెట్ తెస్తామని చెబుతున్నారే తప్ప దాని అమలుపై చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. మెట్రో రైలు ప్రాజెక్టు పేరుతో బస్సు రవాణా, ఎంఎంటీఎస్, ఫుట్‌పాత్‌ల వ్యవస్థలను నిర్లక్ష్యం చేశారన్నారు.

ఎల్‌అండ్‌టీ తప్పుకోవడం ఒప్పంద ఉల్లంఘనే..

తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ... నష్టాల పేరుతో మెట్రో రైలు నిర్వహణ నుంచి ఎల్‌అండ్‌టీ తప్పుకోవడం ఒప్పంద ఉల్లంఘన అవుతుందన్నారు. ఎల్‌అండ్‌టీ సంస్థ ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. నష్టాలకు పూర్తి బాధ్యత ఆ సంస్థనే వహించాలని డిమాండ్ చేశారు. ఒప్పందానికి విరుద్ధంగా మెట్రో రైలు చార్జీలను భారీగా పెంచడం సరైంది కాదన్నారు. ప్రయాణికుల సౌకర్యాలపై ఎలాంటి శ్రద్ధ చూపటం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య, అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, సామాజికవేత్త రాజీవ్‌కుమార్, పర్యావరణవేత్త డా. జైసూర్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వయోధికుల దినోత్సవం



స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: మానవతా దృక్పథంతో స్వచ్ఛంద సంస్థలు అందించే వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ కోరారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320ఏ డిస్ట్రిక్ 320డీ సీనియర్ సిటిజన్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ వయోధికుల దినోత్సవం జరిగింది. ఏవీ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వయోధికులకు బతుకమ్మ, క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందుకు గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ... వయస్సు పై బడిన వారిని ప్రతి ఒక్కరూ ఆదరించి గౌరవించాలని సూచించారు. అదేవిధంగా వారికి తోడుగా ఉంటూ కావాల్సిన సౌకర్యాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ లయన్ దేవేందర్, జవహర్, లయన్ సూర్యప్రకాష్, లయన్ జీకె.రమణ, లయన్ డాక్టర్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డిని సత్కరిస్తున్న మొగుళ్ల రాజిరెడ్డి

కాచిగూడ: దేశంలోని కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జలమండలి ట్రేడ్ యూనియన్స్ జేఏసీ చైర్మన్ మొగుళ్ల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఆదివారం బర్కత్‌పురలో డాక్టర్ జి.సంజీవరెడ్డిని కలిసి పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ .. కార్మికుల ప్రయోజనాలను, హక్కుల రక్షణకై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకపోతే బలమైన పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, రాఘవేంద్ర రాజ్, అల్లి శ్రవణ్ కుమార్, ఎండీ జాంగీర్, ఈ. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



గ్రూప్–1కు ఎంపికైన సభ్యులను సన్మానిస్తున్న ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ప్రజా సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ అన్నారు. ముషీరాబాద్‌లోని వాసవీ ఆర్యవైశ్య భవనంలో ఆదివారం వాసవీ ఫౌండేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ (వీఎఫ్ఈ) ఆధ్వర్యంలో గ్రూప్–1కు ఎంపికైన అభ్యర్థులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వేముల శ్రీనివాస్ మాట్లాడారు. గ్రూప్–1 ఎంపికైన అభ్యర్థులు సామాజిక బాధ్యతతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించేలా పని చేసినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అందుకు గ్రూప్–1కు ఎంపికై సభ్యులు తమ వంతు కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రూప్–1కు ఎంపికైన సభ్యులను ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ ఉప్పల శివకుమార్, మాజీ ఐఏఎస్ ఎం.జగదీశ్వర్, వీఎఫ్ఈ అధ్యక్షుడు కె.శివకుమార్, పద్మశ్రీ రమేష్ గెల్లీ, బి.శ్రీనివాస్, సుబ్బరాజు, రన్‌వీర్, నీరజ్‌గెల్లీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలు చర్యలు తీసుకోవాలి

కాచిగూడ: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ ఫిషరీస్ విభాగం రాష్ట్ర కన్వీనర్ రమణ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక చేత్తో ఇచ్చి.. ఇంకో చేత్తో లాక్కున్న చందంగా బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రభుత్వం రూపొందించిందని ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే 42శాతం రిజర్వేషన్ల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

బీసీల రిజర్వేషన్ల పెంపు జీవోపై కుట్రలు

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపును అడ్డుకునే ప్రయత్నాలు బీసీల అస్తిత్వంపై దాడి అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన బీసీ మేధావుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల న్యాయమైన డిమాండ్లను అడ్డుకోవాలని సుప్రీంకోర్టులో కొందరు దాఖలు చేసిన పిటిషన్లు 'కుట్ర పూరిత రాజకీయ చర్యలు' అని అభివర్ణించారు. బీసీల అభ్యున్నతిని అడ్డుకునే రిజర్వేషన్ వ్యతిరేక శక్తులు మళ్లీ పిటిషన్ల పేరుతో మేల్కొన్నాయని అన్నారు. దీనిని బీసీ సమాజం అంతా గమనించాలని కోరారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు బీసీలు ఏకమై మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ, సాయి, ప్రొఫెసర్ బాగయ్య, బాబా యాదవ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మెషిన్ల పంపిణీ



కాచిగూడ: స్త్రీ హస్తిన మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్ర మహిళా సభ కళాశాల ప్రాంగణంలో కుట్టు మెషిన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీల్వెల్ అధినేత బండారు సుబ్బారావు మహిళలకు కుట్టు మెషిన్లను అందజేశారు. అనంతరం గోసేవకులైన మహిళలకు నవదుర్గా పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి.ఆనంద్, కరాటే కళ్యాణి, సత్యవతి ప్రసన్న, వీర మద్వీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటస్వామి జయంతి ఉత్సవాలు



అన్నదానం చేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి.వెంకటస్వామి 96వ జయంతి ఉత్సవాలను ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల నుంచి ట్యాంక్‌బండ్ వరకు వేయిమంది విద్యార్థులతో 5–కే రన్ నిర్వహించారు. అనంతరం సుమారు 2వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ డా. సరోజ వివేక్, కార్యదర్శి జి.వినోద్, ప్రిన్సిపల్ మట్టాశేఖర్, సీఈవో, డైరెక్టర్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'పాలస్తీనా సమస్య మతపరమైన అంశం కాదు'



ఇందిరాపార్కు వద్ద పాలస్తీనాకు సంఘీభావాన్ని తెలియజేస్తున్న ఐపీఎస్‌డబ్ల్యూపీ ప్రతినిధులు

కవాడిగూడ: పాలస్తీనా సమస్య మతపరమైన అంశం కాదని.. మానవతా సమస్య అని ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీన్ నిర్వాహకులు అన్నారు. రెండు సంవత్సరాలుగా గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని వ్యతిరేకిస్తూ ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీన్ (ఐపీఎస్‌డబ్ల్యూపీ), బీడీఎస్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో పాలస్తీనాకు సంఘీభావంగా ఆదివారం ఇందిపార్కు ధర్నాచౌక్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. దేశ వ్యాప్తంగా చేపట్టిన ఆందోళన కార్యక్రమాలలో భాగంగా చేపట్టిన నిరసన ప్రదర్శనలో డాక్టర్లు, యువత విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇజ్రాయిల్ చర్యలను ఖండిస్తూ పాలస్తీనాకు మద్దతు పలికారు. గాజాలో జరుగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా నిలబడాలనుకునే వారంతా పాలస్తీనాకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దిశ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్స్, నవ జవాన్ భారత్ సభ ప్రోగ్రెసివ్ డాటర్స్ లీగ్ ప్రతినిధులతో పాటు పీఓడబ్ల్యూ సంధ్య పాల్గొని పాలస్తీనాకు తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ నిరసన ప్రదర్శనలో ఐపీఎస్‌డబ్ల్యూపీ సభ్యులు ఆనంద్, బార్గవి, బీడీఎస్ ఇండియా ప్రతినిధి శ్రీజ, పాలస్తీనా మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

త్యాగరాయ గానసభలో ఏబీఆర్‌ఈడబ్ల్యూఏ సమావేశం

చిక్కడపల్లి: ఆల్ బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం త్యాగరాయ గానసభలో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమస్యలను, ఇతర అంశాలపై చర్చించి ఒక నిర్ణయం తీసుకున్నారు. బ్యాంక్‌లో ఉద్యోగ విరమణ పొందిన వారికి హెల్త్ ఇన్సురెన్స్ విషయంలో తక్కువ ప్రీమియంతో ముందుకొచ్చిన ఐసీఐసీఐ లంబార్డ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ విఠల్, సంయుక్త కార్యదర్శి పెద్ది పురుషోత్తమ్, ఐసీఐసీఐ లంబార్డ్ నేషనల్ హెడ్ గిరిధర్, శ్రీకర ఆస్పత్రి మేనేజింగ్ పార్ట్‌నర్ జనార్దన్, డా. కొమురవెల్లి తదితరులు పాల్గొన్నారు.

పేద రోగులకు సేవలందించడం అభినందనీయం



బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

సుల్తాన్‌బజార్: పేద రోగులకు మానవత్వంతో సేవలందించడం అభినందనీయమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆవరణలో నెలకొల్పిన బ్లడ్ బ్యాంక్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా రెడ్‌క్రాస్ అన్ని రాష్ట్రాల ద్వారా పేద రోగులకు సేవలు అందిస్తుందని తెలిపారు. దేశంలో రోగుల సౌలభ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భారత్, వికాసిత్ భారత్ వంటి పథకాల ద్వారా సేవలందిస్తుందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ల ద్వారా బ్లడ్ బ్యాంక్‌లను విస్తరించేందుకు ఉమ్మడి ఒప్పందం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సంస్థలు చేస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్‌బన్సాలి జ్ఞాపకార్థం రూ.10 లక్షల చెక్కును బ్లడ్ బ్యాంక్ కోసం గవర్నర్ చేతుల మీదుగా తెలంగాణ ఐఎంఏ ప్రతినిధులకు అందజేశారు. జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటి మాట్లాడుతూ..నగరంలో పుట్టగొడుగుల్లా నకిలీ సర్టిఫికెట్లు పుట్టుకొస్తున్నాయని వాటిపై రోజుకు 20 ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అశోక్, కోశాధికారి డాక్టర్ దయాల్ సింగ్, ఎలక్ట్రిక్ ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కిషన్, డాక్టర్ కాళీ ప్రసాదరావు, డాక్టర్ కృష్ణారెడ్డి, పీఆర్.సాయికుమార్, డాక్టర్ గట్టు శ్రీనివాసులు, డాక్టర్ తపాడియా, డాక్టర్ సాయిరాం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిమాయత్‌నగర్: హైదరాబాద్ జిల్లాలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఎస్‌వీ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్స్, టీహెచ్‌ఎం, జేఎల్ ఫిజిక్స్, ఇంగ్లీష్, టీహెచ్‌ఎం, పీజీటీ బయో సైన్స్, ఇంగ్లీష్, స్టాఫ్ నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. టీఆర్‌ఐబీ ప్రకారం అర్హతలు గల అభ్యర్థులు బయోడేటాతో పాటు సర్టిఫికెట్లతో రూం.నెం 606 హజ్లీస్ ఎదురుగా పబ్లిక్ గార్డెన్, నాంపల్లి హైదరాబాద్ కార్యాలయ పని వేళల్లో ఈనెల 6 నుంచి 9 లోగా అందించాలన్నారు. షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక ప్రక్రియకు పిలుస్తారని వెల్లడించారు.

పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలను జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జావేద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వామపక్షాలు, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన నగరంలో నిర్వహించే పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు జావేద్, శ్రీకాంత్ కోరారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యుద్ధం పేరుతో 24 నెలల కాలంలో 64 వేల మంది ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారని అన్నారు. కనీసం యుద్ధ విలువలను కూడా పాటించకుండా నరమేధాన్ని సాగించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. తక్షణమే పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అస్మిత, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి అండగా నిమ్స్

లిఫ్ట్ బాయ్‌గా ఉద్యోగమిచ్చిన డైరెక్టర్ బీరప్ప



లక్డీకాపూల్: నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) శంషాబాద్‌కు చెందిన దివ్యాంగుడు చాకలి మల్లేశ్ కుటుంబానికి అండగా నిలిచింది. జీవనోపాధి కోసం ఉపాధి కల్పించాలంటూ మల్లేశ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పను అభ్యర్థించాడు. దీంతో మానవతా దృక్పథంతో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఆస్పత్రిలో లిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. అంతేగాకుండా ఇంటర్ వరకు చదివిన మల్లేశ్ భార్యకు కూడా భవిష్యత్తులో ఉద్యోగావకాశం కల్పిస్తామని ఆయన హామీనిచ్చారు. ఈ సందర్భంగా మల్లేశ్ తనకు అవకాశాన్ని కల్పించినందుకు డైరెక్టర్ బీరప్పకు కృతజ్ఞతలు తెలిపారు.

అజ్రా ఫాతిమాకు డాక్టరేట్

కాచిగూడ: హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి అజ్రా ఫాతిమా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఇటీవల యూనివర్సిటీలో జరిగిన 26వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ చాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అజ్రా ఫాతిమా అందుకున్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రబీనంద్రనాథ్ సాలమన్ పర్యవేక్షణలో 'ఇన్వెస్ట్‌మెంట్ డెసిషన్ ఆఫ్ ఇండివిజువల్ ఈక్వాలిటీ ఇన్‌వేస్టర్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆదివారం అజ్రా ఫాతిమాను పలువురు అభినందనలు తెలియజేశారు.

మనుషులకి దైవభక్తి.. దేశభక్తి.. దేహభక్తి ఉండాలి



కేవీ రమణాచారి దంపతులకు మాట కచేరి గ్రంథం అంకితమిచ్చి సత్కరిస్తున్న వీసీ నిత్యానందరావు

చిక్కడపల్లి: చిమ్మపూడి శ్రీరామమూర్తి రచించిన 'మాట కచేరి' గ్రంథం అంకితోత్సవ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. కేవీ రమణాచారి దంపతులకు ఈ గ్రంథాన్ని తెలుగు విశ్వవిద్యాలయం వీసీ నిత్యానందరావు అంకితమిచ్చి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మనుషులకి దైవభక్తి, దేశభక్తి, దేహభక్తి ఉండాలన్నారు. ఈ సందర్భంగా 'స్వర రసాంజలి' శీర్షికతో నిర్వహించిన సంగీత విభావరి అందరినీ అలరించింది. చిమ్మపూడి ఫౌండేషన్, త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు అనంత పద్మనాభరావు, అరుణ, యదుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



మహిళలకు ఉచితంగా కుట్టు మెషిన్లను పంపిణీ చేస్తున్న అవోపా అధ్యక్షుడు నమఃశివాయ

చిక్కడపల్లి: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ (అవోపా) అధ్యక్షుడు ఆర్.నమఃశివాయ అన్నారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని అవోపా కార్యాలయంలో మహిళలకు ఉచితంగా 48 కుట్టు మెషిన్లు, 15మంది విద్యార్థులకు రూ.2లక్షల స్కాలర్‌షిప్‌లు, అనాథాశ్రమాలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీల్వెల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ బండారు సుబ్బారావు సహకారంతో అందజేశామని తెలిపారు. పేదలకు సహాయ సహకారాలు అందించేందుకు అవోపా ఎల్లప్పుడూ ముందు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథి ఆనంద్, అవోపా ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, కోశాధికారి మాకం బద్రినాథ్, ఏపీ పూర్వ అధ్యక్షుడు చంద్రశేఖర్, వామ్ నాయకులు ఊరబాబురావు, సుంకర మేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.